# లవ్ స్టోరీ

## నిరుడు కురిసిన హేమంతం...

అనూషా!

బావున్నావా మిత్రమా? పుడమి కడుపున దాగి తొలకరికి మొలకెత్తే విత్తనంలా గుండె లోతుల్లో నిక్షిప్తమై యే అర్ధరాత్రో చీకటి నీరవంలో వెన్నుతట్టి నా ఒంటరితనాన్ని దూరం చేసే ఓ మృదుమధుర చిరు జ్ఞాపకమా కుశలమా?

ఓ చలికాలపు ఉదయం కాలేజీ ఆవరణలో అడుగిడుతోంటే రాత్రి కురిసిన మంచులో తడిసిన చిన్ని మల్లె మొగ్గలా కన్పించావ్. ఎవరితోనో మాట్లాడుతూ నా అడుగుల సవ్వడి కనుకుంటానూ – గుమ్మం వేపు తిరిగి నను చూసావ్! నన్ను చూడగానే నీ కన్రెప్పలెందుకు అన్ని సార్లు పక్షి రెక్కల్లా కొట్టుకున్నాయ్? యే పూర్వజన్మ స్మృతో నీ హృదయంలో మెదిలి నిను కదిలించింది నేస్తం! నాకు మాత్రం నిను చూడగానే బాల్యంలో సముద్రతీరాన యిసుకలో పారేసుకున్న మధుర జ్ఞాపకమేదో దొరికినట్లనిపించింది. అది మొదలు... ఎప్పుడూ పారే సెలయేరులా గలగలా మాట్లాడుతూ, చలాకీగా తిరిగే నాలో యేదో దిగులు...... సరిగ్గా చెప్పాలంటే చెరువు గట్టున కూర్చుని నీటిలో ప్రతిఫలించే నీ ప్రతిబింబాన్ని చూస్తూ వుండిపోవాలనిపించేది. నవ్వొస్తుందా? నవ్వకు. ప్లీజ్. నా కెందుకో నీ సాహచర్యం కంటే నీ తలపులే ఎక్కువగా యిష్టమయ్యేవి. అందుకేనేమో నీ తలపుల్ని నా కొదిలి నీవు మాత్రం సుదూర తీరాలకు సాగిపోయావ్. నీవు కనిపించనపుడు నీతో ఎన్నో చెప్పాలనుకొనేవాడిని. కానీ నీవు కన్పించగానే నా గొంతెందుకో మూగబోయేది. నీకు చెప్పాలనుకున్నవన్నీ నీ ప్రతిబింబంతో చెప్పేవాడ్ని మూగగా. ప్రేమలో పడ్డవాళ్ళు చాలా హుషారుగా వుంటారని వ్రాస్తారు కథల్లో. కానీ నాకు క్రమక్రమంగా రిజర్వ్‌డ్‌నెస్, హుందాతనం అలవాటయ్యాయి.

కాలేజీలో ఎక్స్‌కర్షన్ ఎనౌన్స్ చేసినప్పుడు నా జేబులో చిల్లిగవ్వ కూడా లేదు. నీవు వెళుతున్నావని తెల్సింది. నీవు వెళ్ళిపోతే ఆ ఎనిమిది రోజులూ ఎలా గడపాలో తెలీదు. నేనూ వద్దామంటే మనీ ప్రాబ్లమ్. చనిపోతూ నాన్నగారు యిచ్చిన వుంగరాన్ని అమ్మేసి, నీతో పాటూ ఎక్స్‌కర్షన్‌కి వచ్చాను. నిన్ను చూస్తూ, "గీతాంజలి" చదువుకుంటూ, భీమ్లీ, అరకుల్లోని ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ గడిపిన ఆ ఎనిమిది రోజులూ నా జీవితంలో ఓ మర్చిపోలేని మధుర జ్ఞాపకానుభవం.

కొద్ది రోజుల ఎడబాటుకే భయమేసి నీతో ఎక్స్‌కర్షన్‌కి వచ్చిన నేను, యిన్ని సంవత్సరాలుగా నీవు ఎక్కడో వున్నా ఎలా బ్రతికున్నానో నాకిప్పటికీ అర్థం కాదు. బహుశా మృతిలేని నీ స్మృతులే నన్ను బ్రతికుంచాయనుకుంటాను.

ఆ వినోద పర్యటనే మన మధ్య దూరాన్ని తగ్గించింది. ఇక్కడ దూరాన్ని తగ్గించడమంటే నా మీద నీకు ప్రేమ కలిగిందని కాదు. నీ దగ్గర నాకు కాస్త చనువేర్పడింది. ఎందుకంటే నీ మాటల్లో నా మీద నీకు ప్రేమ వున్నట్లు నాకెప్పుడూ అన్పించలేదు, ఆప్యాయతా.. అభిమానం తప్ప.

ఫైనలియర్ ఎగ్జామ్స్ దగ్గరయ్యేకొద్దీ నాలో దిగులు రోజు రోజుకీ ఎక్కువయ్యేది. నా మనసులో కదలాడే భావాల్నీ, ఆశల్నీ నీతో చెప్పలేని పిరికితనం నన్ను వెక్కిరించేది. నీ మీద ఎన్ని కవితలు వ్రాసానో తెలుసా, సుమారు నూట యాభై పైనే. నీకివ్వాలని రెండు లెటర్స్ వ్రాసాను అప్పట్లో. కానీ నీతో మాట్లాడడానికే బిడియపడేవాడ్ని, యివ్వలేకపోయాను.

నీ ఎగ్జామ్ నంబర్ నిన్ను అడిగితే చెప్తావు. కానీ భయం. అందుకే నీవే రూమ్‌లో, యే బెంచీ మీద కూర్చున్నావో చూసి, ఎగ్జామ్ అయిపోయాక వెళ్ళి ఆ బెంచీ మీద నంబర్ నోట్ చేసుకున్నాను. తలుచుకుంటే యిప్పుడు నవ్వొస్తుంది.

లాస్ట్ ఎగ్జామ్ రోజున నీకేదయినా గిఫ్ట్-- జ్ఞాపకంగా యివ్వాలనిపించింది. ఆలోచిస్తే ఠాగోర్ 'గీతాంజలి' గుర్తొచ్చింది. మనసుగల మనిషికి గిఫ్ట్‌గా యివ్వడానికి ఠాగోర్ గీతాంజలిని మించింది నాకేదీ కన్పించలేదు. ఎగ్జామ్ అయిపోయాక, ఆ సాయంకాలం గీతాంజలి పుస్తకంలో నా చిన్ని కోరిక వ్రాసి నీకిచ్చాను. అది...

**"I am not expecting any thing from you, except a little smile at the seconds of my last breath".** చాలా చిన్నగా కనిపించే నా పెద్ద కోరికకు నవ్వుకొన్నావా నేస్తం!

ఎగ్జామ్స్ అయిపోయాక నీవు మీ వూరెళ్ళిపోయావ్. నేను మాత్రం ప్రతిరోజూ కాలేజీకి వెళ్ళి నీ వెప్పుడూ కూర్చునే చప్టాలో కూర్చుని కాలాన్ని కరిగించేవాడ్ని. లేచప్టాపై రాత్రి కురిసిన మంచుబిందువులపై సూర్యకిరణాల విశ్లేషణాన్ని చూస్తూంటే నీ నవ్వే గుర్తొచ్చేది. ఎంత అందంగా వుండేదనీ నీ నవ్వు! తెల్లని ముత్యాల్లాంటి పళ్ళపై సూర్యకాంతి ప్రతిఫలించేలా, పల్చటి పెదాలను మెల్లగా కదిపి నీవు నవ్వుతూంటే, నాకు సితార తీగెల్ని కొనగోటితో మీటినట్లుండేది. నీవు నవ్వుతున్నప్పుడు నీ చిన్ని ముఖాన్ని నా చేతుల్లోకి తీసుకుని నీ నుదుటిని ముద్దెట్టుకోవాలనే కోర్కె చాలా బలీయంగా కలిగేది. యండమూరి అంటాడు ఓ నవల్లో... "కనీసం నుదుటున ఓ చిరుముద్దయినా అద్దకుండా స్వచ్ఛతను ఆపాదించుకుంటుండే ప్రాణం" అని. నా జీవితమూ అంతేనేమో!

రిజల్ట్స్ వచ్చిన కొన్నాళ్ళకు పక్క వూళ్ళోని ఓ ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా జాయినయ్యాను. కాలేజీకి దగ్గర్లో ఓ చిన్న పోర్షన్ అద్దెకు తీసుకుని అమ్మని తీసుకెళ్ళిపోయాను. నాన్నగారు నా చిన్నతనంలోనే పోయారు. నాన్నగారుండగానే అక్క పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయింది. జాబొచ్చాక అమ్మ పెళ్ళి చేసుకోమని రోజూ గొడవ చేసేది. నీవుండాల్సిన స్థానంలోకి మరొకర్ని ఆహ్వానించలేకపోయాను. అడిగి అడిగి విసుగొచ్చిందేమో అమ్మ కూడా అడగడం మానేసింది.

యిప్పటికీ అదే కాలేజీలో చేస్తున్నాను. జీతం పెరిగింది కానీ, అదే వుద్యోగం. అదే సబ్జక్ట్... రొటీన్ లైఫ్. కానీ ఎప్పటికప్పుడు ఫ్రెష్‌గా నీ తలపులూ, ఆలోచనలూ నన్ను

రచయిత చిరునామా:
—మక్కా శ్రీనివాసరావు
మండూరి వారి వీధి, వార్డ్ నెం. 21,
ఏలూరు-2



నడిపిస్తున్నాయి. అప్పటి మిత్రులందరూ వేరు వేరు వూళ్ళలో సెటిలయిపోయారు. మనూ ఒక్కడే ఎప్పుడూ కలుస్తూంటాడు. పెళ్ళయింది, యిద్దరు పిల్లలు వాడికి. పెదపాపకి మనిద్దరి పేర్లూ కలిపి "శివోష్" అని పేరు పెట్టాడు. నేను మాత్రం "చిన్న అనూష" అని పిలుస్తూంటాను ముద్దుగా.

నిన్ను చూడాలనే కోర్కె బలీయమై చాలా సార్లు మీ వూరొచ్చాను. నిలువెత్తు ప్రహారీల వెనుక రాజమహల్లో నీవూ, మీ యింటి సింహద్వారం ముందు రహదారిపై నేనూ. కింది కమ్మీలు కలుపుతున్నా, ఎన్నడూ కలుసుకోని రైలు పట్టాల్లా... తలపుల్లో దగ్గరైనా భౌతికంగా ఎంత దూరం మన మధ్య! రోజంతా బాగానే గడిచిపోతుంది కాలేజీలో. కానీ పడమటి కొండల వెనుక సూర్యుడు ఒదిగిపోయాక నాలో యేదో తెలీని వేదన వుబుకుతుంది. చీకటే... నిశ్శబ్దం... ఆలోచన్ల అలలూ... నాకెందుకో జీవితం మీద నిరాసక్తత కలుగుతోంది. ఏదో ఎగోనీ, అర్థం కాని భావనా... చచ్చిపోవాలనే కోర్కె బలీయమవుతోంది. నీకు ఏ మాత్రం వుపయోగపడని నా జీవితం మీద నాకే రోత, అయిష్టత పుడుతోంది.

నా ఈ జీవితాన్నుండి వీడ్కోలు తీసుకోవాలనుంది మిత్రమా! మృత్యు దేవత ఒళ్ళో వాలక ముందు నిన్నొకసారి చూడాలనుంది. ఒక్కసారి వచ్చి వెళ్ళవూ! "నీ నుంచి నేనేమీ ఆశించను నేస్తం! ఈ జీవితాన్నుంచి నేను వీడ్కోలు తీసుకోబోయే చివరి క్షణాలలో నీ చిరునవ్వును తోడు చేసుకోవాలనే ఆశ తప్ప".

నీకిచ్చిన గీతాంజలి పుస్తకంలో వ్రాసిన ఈ నా చిన్న కోరికను తీరుస్తావని ఆశిస్తాను. నేనీ ప్రపంచపు సరిహద్దులు దాటిపోక ముందే వస్తావని ఆశతో ఎదురు చూస్తుంటాము నేస్తం!

—నీ "శివ"

అది పన్నెండోసారి అనూష ఆ వుత్తరం చదవడం. ఆ రోజు మధ్యాహ్నమే అందిందది, పోస్టు చేసిన రెండు నెలలకు డెలివరీ చేసిన పోస్టల్ డిపార్ట్‌మెంటు వారి పనితనానికి నిదర్శనంగా.

మనసులో అడుగున పడిపోయిన జ్ఞాపకమేదో కదిలి, భారంగా కళ్ళు మూసుకుంది అనూష. అర్ధరాత్రి దాటింది. టైము సుమారు రెండవుతూందేమో. సన్నగా వినవస్తోన్న ఏ.సి. మెషీన్ చప్పుడు నిశ్శబ్దాన్ని భంగ పరుస్తోంది. గదిలోని ట్యూబు లైట్ చీకటిని పారద్రోలుతోంది. మూసుకున్న కనెప్పల తెరల మీద కాలేజీ సంఘటనలు సినిమా రీళ్ళలా సాగిపోతున్నాయి. ఓ అమాయకమైన కుర్రాడి ముద్దు మోము... ఎక్స్‌కర్షన్ సంఘటనలూ... ఎగ్జామ్స్ చివరి రోజు శివ 'గీతాంజలి' యివ్వడం... వరుసగా గుర్తొచ్చాయి.

ఆలోచనల వేడికో, తనను ప్రేమించిన వ్యక్తి బాధామయ స్థితికో కనుకొలకుల్లోంచి వుబికిన కన్నీటి చుక్క చెంప మీదుగా జారి దిండులో యింకిపోయింది.

నిద్రపోతున్న బాబు మీద కాలేసే సరికి ఇహలోకంలోకి వచ్చింది అనూష. భర్త బిజినెస్ వ్యవహారమై టూర్ వెళ్ళి రెండు రోజులైంది. యింకో నాలుగు రోజుల వరకూ రారు. ఆయనొచ్చే వరకూ ఆగాలనిపించక, మిత్రుడ్ని చూడాలనే కోరికకు తట్టుకోలేక, వుదయాన్నే బాబుని అత్తగారికి వొప్పజెప్పి గుడివాడ బస్సెక్కింది. ప్రయాణంలో కూడా ఆలోచన్లే. గుడివాడ బస్టాండ్‌లో బస్సాగేసరికి సాయంకాలం కాలేజీలో లెక్చరర్స్ ఎవరూ లేరు.

"శివగారు వున్నారా?" అడిగింది ప్యూనుని.

అనూష మొహంలోకి ఆశ్చర్యంగా చూసి "ఆయన మీకేమవుతారు" అనడిగాడు ప్యూను

"నన్ను ప్రేమించిన వాడూ, జీవితపు ప్రతీ క్షణంలోనూ నన్నే తలుచుకొని విలపించిన వాడూ" అని మనసులో అనుకొని, "కాలేజీలో కలిసి చదువుకున్నాం" అంది పైకి.

ఒక్కసారి జాలిగా చూసి "ఆయన పోయారు, నెల రోజులవుద్దేమో" అన్నాడు. కళ్ళు తిరిగినట్లయి తూలి పడబోతూ గేటు పట్టుకొని నిలబడింది అనూష. కళ్ళల్లో నీళ్ళూ, గుండెల్లో వేదనా ఒక్కసారిగా వుబికాయ్.

"ఆయన యింటి అడ్రస్ తెలుసా" ఏడుపు స్వరంతోనే అడిగింది. తనే వెంట బెట్టుకొని తీసుకెళ్ళాడు.

ఇంటి ముందు లాన్‌లో మోకాళ్ళలో తల పెట్టుకొని కూర్చున్న మనూ అడుగుల సవ్వడికి తలెత్తి చూసాడు. ఎదురుగా "అనూష."

తెలిసిన వ్యక్తి కనపడడంతో ఒక్కసారిగా కిందబడి భోరున విలపించింది అనూష. పండిన మొగలి పొత్తి వంటి ప్రారంభ యవ్వనపు దినాల్లో పూచిన గులాబీ తోటలో విహరిస్తున్నప్పుడు ప్రేమ జల్లు కురిపించిన శరన్మేఘ శకలం లాంటి స్నేహితుడు యిక లేడని తెలిసి నప్పుడు కలిగే దుఃఖాన్ని యే ఓదార్పూ ఆప లేదని తెలిసి మనూ కూడా ఆమెని ఓదార్చే ప్రయత్నం చెయ్య లేదు.

చాలా సేపటికి దుఃఖాన్నించి తేరుకుని, "ఎప్పుడు పోయారు" అని అడిగింది మనూని.

"ఫిబ్రవరి 16, గురువారం రాత్రి"

'అంటే తనకి వుత్తరం వ్రాసిన నెల రోజులకి' అనుకుంది మనసులో.

"ఎలా జరిగిందిది" అడిగింది అనూష.

"గుండె నొప్పి, నిద్రలోనే" చెప్తున్నాడు పక్కనే వున్న ప్యూను.

* * *

నిజానికి 'శివ' ఎలా చనిపోయిందీ నా ఒక్కడికే తెలుసు. అనూషకి వ్రాసిన వుత్తరం పోస్టు చేసిన తర్వాత నెల రోజులు ఎదురు చూసి, అనూష యిక రాదని నిర్ణయించుకొని, నిద్ర మాత్రలు మింగి చనిపోయాడని నా ఒక్కడికే తెలుసు. ఎందుకంటే వాడిని ఎప్పుడూ కలిసే "మనూ"ని నేనే కాబట్టి. తన వలన ఓ వ్యక్తి చనిపోయాడనే మానసిక బాధ తనకి వుండకూడదని, అనూషకి ఆత్మహత్య విషయం చెప్ప లేదు నేను.

ఇప్పటికీ వాడు యే అర్ధ రాత్రో చీకటి పొరల మధ్య గాలితెరై నన్ను పలకరిస్తాడు. శీతాకాలపు వుదయాన కురిసే మంచు బిందువుల్లో తడిసిన తెల్లని మల్లె మొగ్గయి సుగంధాన్ని వెదజల్లుతాడు. ●

ప్రతిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్